# శ్రీ రమణ జ్యోతి

డిసెంబర్ 2017

ఈ సంచికలో ...

# Sri Ramana Jyothi

December 2017

IN THIS ISSUE ...


| | | | |
|---|---|---|---|
| 1. | డా॥ కే.ఎస్. గారి 44వ ప్రవచనము | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| 2. | శ్రీ భగవాన్ పాద సన్నిధిలో | జి. శ్రీహరిరావు | 8 |
| 3. | భగవాన్ రమణుల దైవిక లీలలు | విడపనకంటి | 12 |
| 4. | విజయనగరం 'రమణ స్వామి' | | 15 |
| 5. | ప్రయత్నం అవసరమా? | డా॥ వి. రామదాస్ మూర్తి | 21 |
| 6. | The unfathomable Sri Bhagavan (Part 2) | Gudipati Venkata Chalam | 26 |
| 7. | Vasanas - The major obstacle in Sadhana | V. Krithivasan | 31 |
| 8. | The Paavai Songs of Andal, Manickavachagar and Muruganar | K. Lalitha | 35 |
| 9. | Ideal Home Life | T.R. Kanakammal | 41 |



శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు : కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్

(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)

**Editorial Board:** Telugu: **Dr. V. Ramadas Murthy, Malladi Phanimala, Katravulapalli Subbalakshmi**

English: **V. Krithivasan, N.S. Ramamohan, Sneha Choudhury**

# శరణాగతి

ఆంగ్ల మూలం: డా॥ కే.యస్. గారి 44వ ప్రవచనము

తెలుగు అనువాదం: డా॥ వి. రామదాస్ మూర్తి

**ఆధ్యాత్మికత ఆచరణలో చూపాలి**

మనం ఆధ్యాత్మికత గురించి మాట్లాడుతుంటాము. ముఖ్యమైనది ఏమిటంటే, అది మన నిత్య జీవితంలో ప్రతిఫలించాలి. ఆధ్యాత్మికత పూజగదికి పరిమితం కారాదు. మన చుట్టు ప్రక్కల వారి విషయంలో మన ప్రవర్తన కనిపించాలి. అలాగ కానప్పుడు అది మతం కాదు అని భగవాన్ ఎన్నోసార్లు చెప్పారు. లౌకిక విషయాల నుండి దూరంగా వుండడమని అంటే, ఎవరినీ పట్టించుకోకుండ వుండడం అని కాదు, అవసరమని గుర్తించినప్పుడు సహకారం అందించడం, బాగోగులను చూడడం.

ఈనాటి సత్సంగంలో శ్రీనాథ్‌గారి తండ్రి శ్రీ లింగా లక్ష్మయ్యగారు రావడం ఆనందంగా వుంది. త్వరలో 90వ దశకంలోనికి అడుగు పెడ్తున్న ఆయన మనం ఎలా వుండాలి అని అనుకొంటామో, అలా జీవిస్తున్నారు. నలభైయిద్దరు కుటుంబ సభ్యులున్న ఇంట్లో, వంట మనిషి లేని చోట, కోడళ్ళకు సహాయంగా, అంతమంది భోజనానికి అవసరమైన కూరగాయలను రెండు పూటల, రోజు తరువాత రోజు తరుగుతున్నారంటే, వారు ఇతరులను గురించి ఎంత బాధ్యతా యుతంగా ఆలోచిస్తున్నారో తెలుస్తుంది. అంతే గాకుండ గత డెభ్భై ఏళ్ల నుండి ఖాదీ వస్త్రాలను మాత్రమే ధరిస్తున్నారన్నది చిన్న సంగతి కాదు. అదే, మరెవరి విషయమో అయితే, పేపర్లు, మీడియా తెగ ప్రచారం చేసేవి.

వ్యక్తిత్వం పరిణతి చెందడమంటే, తన గురించి కాదు, ఇతరుల గురించి ఆలోచించడం, ఇతరులకు సహాయపడడము. కొందరు అలా బ్రతికితే తమ సంగతి ఎవరు చూస్తారని తలుస్తారు. అప్పుడు భగవంతుడే అన్నీ చక్కదిద్దుతాడు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు, ఎవరు నా గురించి ధ్యానిస్తూ, మరే ఇతర చింత లేకుండ వుంటారో, వాళ్ళ దినసరి బాగోగులకు నేనే బాధ్యత వహిస్తాను అని భరోసా ఇచ్చాడు. ఇక్కడ గమనించవలసింది శ్రీకృష్ణుడు అంతవరకే అన్నాడు. మనం శరణాగతి చెందాము కదా, అని మనల్ని ఇతరులకు భిన్నంగా, ప్రత్యేకంగా చూడాలి అని అనుకొంటే, అది కుదరదు.

**నిష్క్రమణకు నాంది**

ఇక రమణమహర్షి తమ పదిహేడేళ్ళ వయసులో, తమ 'తండ్రి' అరుణాచలుని పిలుపు మేరకు తిరువణ్ణామలై బయలుదేరిన వృత్తాంతం గొప్ప ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది, మనకు ఎన్నో క్రొత్త విషయాలను తెలుపుతుంది. అంతకు కొన్ని నెలల ముందే, 'అరుణాచలం' అన్న పదం అతనిని పులకింప జేయడంతో అప్పటి నుండి అదే ధ్యాసలో వుండిపోయారు. కాని తాము ఆ రోజున బయలు దేరుదామని అనుకోలేదని తరువాత ఎప్పుడో చెప్పారు. ఆయన ఇంటిని విడిచిపెట్టడం దగ్గరి నుండి తిరువణ్ణామలై చేరిన వరకు జరిగిన సంఘటనలు ఎలా దోహదపడ్డాయో తెలుసుకుంటే, ఆశ్చర్యం వేస్తుంది.

తన తమ్ముడు చదువుపై తగిన ఉత్సాహం చూపక, తరచు కళ్ళు మూసుకొని ధ్యానంలో కూర్చుంటున్న తీరును తప్పు పట్టిన ఆయన అన్నగారు తిట్టడంతో వెంకట్రామన్ ఇల్లువదలి వెళ్ళ నిశ్చయించు కొన్నాడు. అంతకు ముందు అన్నగారు జీతం కట్టమని ఇచ్చిన ఐదు రూపాయలలో మూడు రూపాయలను మాత్రం తీసుకొన్నాడు. తల్లి,

అన్న ఆదుర్దాపడతారన్న ఉద్దేశంతో ఒక ఉత్తరం వ్రాసిపెట్టాడు. నేను తండ్రి ఆజ్ఞ మేరకు ఇల్లు వదలి వెళుతున్నానని, 'ఇది' ఒక మంచి కార్యం కోసం వెళుతోందని, 'దీని' కోసం ఎవరూ వెదికే ప్రయత్నం చేసి డబ్బు వృథాగా ఖర్చు చేయవద్దని, అన్నగారి జీతం కట్టలేదు, రెండు రూపాయలు వదలి వెళుతున్నానని వ్రాసి అడుగున సంతకం చేయకుండ ఒక గీత పెట్టాడు. 'నేను' అని మొదలుపెట్టి చివరికి పేరు కూడ వ్రాయకుండ వదిలేశాడు. చేతిలో మూడు రూపాయలతో బయలుదేరాడు.

రైల్వేస్టేషన్ చేరడానికి ఇరవై ని॥లు నడవాలి. రైలు అందుకొనేందుకు ఆలస్యం అవుతుందని తెలిసినప్పటికి, ప్రయాణం వాయిదా వేయలేదు. కాని ఆ రోజు రైలు అరగంట ఆలస్యంగా వచ్చింది. స్టేషన్ పట్టికలో తిండివనం స్టేషన్‌కు టికెట్ రెండు రూపాయల పదమూడు అణాలుగా వ్రాసి వుంది. కాని పట్టిక సరిగా చూసివుంటే తిరువణ్ణామలైకి సరిగా మూడు రూ॥లు అయి వుండేది. ఉన్న మూడు రూపాయలలో నుండి తిండివనంకు టికెట్ తీసుకున్నాడు. చేతిలో వున్న ఆ కొద్ది నాణాలతో ప్రయాణానికి సిద్ధపడి రైలు ఎక్కి, కళ్ళు మూసుకొని ధ్యానంలోనికి జారుకున్నాడు. ఆ పరిస్థితుల్లో మనం ఉండి వుంటే, తిరుగు ప్రయాణానికి కూడ డబ్బులు లేవే, ఖర్చులకు ఎలాగ, ఒకవేళ అక్కడ ఉండడం కుదరకపోతే, ఎలాగ అని పరిపరి విధాల ఆలోచించివుండేవాళ్ళం. కాని వెంకట్రామన్‌కు తిరుగు ప్రయాణం అంటూ వుండదన్న విశ్వాసం వల్ల ఇక దేని గురించిన అనుమానం, భయం కలుగనేలేదు. మిగత విషయాలు తనను ఆహ్వానించిన తండ్రి యొక్క బాధ్యత అని నిశ్చింతగా ఉన్నాడు. ఎంత గొప్ప ధైర్యం, ఎంత అసాధారణమైన శరణాగతి!

## ఒడిదుడుకుల ప్రయాణం

వెంకట్రామన్ ఎక్కిన రైలుపెట్టెలో ఒక మౌల్వీ కూడ ఉన్నాడు. అతడు ఇతర ప్రయాణికులతో సాధువులు, మత గురువులను గురించి మాట్లాడుతున్నాడు. ఈ కుర్రవాడు మాత్రం పరిసరాల ధ్యాస లేకుండ, తన్మయత్వంలో ఉన్నది గమనించాడు. “స్వామీ! స్వామీ! ఎక్కడికి వెళుతున్నావు?” అని అడిగాడు వెంకటరామన్‌ను. సాధారణంగా చిన్న బాలుడిని ఎవరైన “స్వామీ” అని సంబోధిస్తారా? వినడానికి వింతగా ఉంది. జవాబుగా అతడు “తిండివనం వెళుతున్నాను. అక్కడి నుండి తిరువణ్ణామలై వెళ్లాలి” అన్నాడు. తిండివనం వెళ్ళనక్కర లేదని, విల్లుపురంలో దిగి రైలు మారితే, తిరువణ్ణామలై తీసుకెళుతుందని మౌల్వీ చెప్పాడు. అలాగా, అని తిరిగి ధ్యానంలో పడ్డాడు. సాయంత్రం ఆరుగంటలకు రైలు తిరుచినాపల్లి చేరింది. కళ్ళు తెరిచి చూస్తే మౌల్వీ లేడు.

ఆకలివేస్తే, రెండు పళ్ళు కొని తిన్నారు. తిండి పుష్టితో బాటు, స్వయంగా క్రీడాకారుడు, మల్లయోధుడు కావడం వల్ల అంతటితోనే ఆకలి తీరడం అతనికే ఆశ్చర్యం వేసింది. మళ్ళీ ధ్యానం మొదలు పెట్టాడు. తెల్లవారుజామున మూడుగంటలకు రైలు విల్లుపురం చేరింది. రైలు దిగాడు. తిరువణ్ణామలైకి దారి ఎటు అని చూస్తున్న సమయంలో ‘మాంబళం పట్టు’ అని ఒక బోర్డు అగుపడింది. దగ్గర వున్న మూడు అణాలలో అప్పటికే ఒకటి ఖర్చుచేసి పళ్ళను కొనడంతో రెండు అణాలు మిగిలాయి. అక్కడ ఒక హోటల్ చూసి ఆ యజమానిని భోజనం కావాలని అడిగాడు. కూర్చో, పన్నెండు గంటలకు భోజనం తయారవుతుందని అతడు చెబితే, అక్కడే ధ్యానం చేయసాగాడు.

భోజనం తరువాత యజమానికి తన దగ్గరి రెండు అణాలను ఇవ్వబోతే, "నీ దగ్గర మొత్తం ఎంత ఉందని" అడిగాడు. రెండు అణాలని బదులిచ్చాడు. చిన్నవాడు అంతగా ధ్యానం చేస్తున్నది గమనించిన అతడు ఆ డబ్బును తీసుకొనకుండ, నీ దగ్గరే ఉంచుకోమన్నాడు.

ఈ విషయాలను గమనిస్తే, మనకు కొంత ఆశ్చర్యం వేయవచ్చు. తనను నమ్ముకుని బయలుదేరిన బాలుడిని, ఏ ఇబ్బంది లేకుండ మదురై నుండి తిరువణ్ణామలై చేరుకొనేలాగ ఎందుకు అరుణాచలేశ్వరుడు సంకల్పించలేదు? కారణం లేకపోలేదు. మరే ప్రతిఫలం ఆశించకుండ, మౌల్వీ మొదలుకొని హోటల్ యజమాని వరకు ఇతరులు అతనికి సహాయం చేయడానికి అవకాశం కల్పించాడు. ముఖ్యంగా హోటల్ యజమానికి ఏమీ తీసుకోకుండ ఆహారం పెట్టిన భాగ్యం కలిగింది. జ్ఞానికి, మంచివారికి, ఆహారం ఇస్తే అలా చేసిన వారి పై ఏడు తరాలు, తరువాతి ఏడు తరాలకు తిండి కొరత ఉండదని శాస్త్రాలు చెబుతున్నాయి.

ఒకప్పుడు ధర్మరాజు భీష్మాచార్యులను "పేదలకు అన్నదానం చేయమని మీరు నాకు చెప్పారు. కాని వాళ్ళలో చాలామంది అబద్ధాలు చెప్పేవాళ్ళు, రౌడీలు, చెడ్డవాళ్ళు, ఉన్నట్లు తెలుస్తోంది. అలాంటి వాళ్ళకు అన్నం పెట్టడం వల్ల ఏ మంచి జరుగుతుంది" అని అడిగాడు. అందుకు జవాబుగా భీష్ముడు, "నీవు చెప్పేది నిజం కావచ్చు. కాని ఎవరినైన పూర్తిగా మంచివారా, కాదా అని తెలుసుకొనలేవు. రెండు, మూడేళ్ళ కాలంలో నీవు వెయ్యి మందికి అన్నదానం చేసి వుండవచ్చు. రాజువి గనుక రోజూ కూడ అంతమందికి ఆహారం పెట్టగలవు. కాని అంతమందిలో నిజంగా ఆకలితో వుండి, మంచివాడు ఒకడైన తిన్న

తరువాత ఆశీర్వదిస్తే, నీకే కాదు, నీ పూర్వీకులు, తరువాతి వారు కూడ రక్షింపబడతారు. అలాగ అర్హుల కోసం వెదుకుతూ పోతే ఇతరులకు ఇచ్చే అవకాశమే నీకు దొరకక పోవచ్చు. ముఖ్యమైన దేమిటంటే, ఇచ్చేదేదో శ్రద్ధతో ఇవ్వాలి. భగవాన్ విషయానికి వస్తే హోటల్ యజమాని ఆ బాలుడు అసామాన్యుడని గుర్తించాడు, పుణ్యాత్ము డయ్యాడు. ఆ ప్రభువు కృప ఉంటే తప్ప అలాగ గుర్తించడం సాధ్యం కాదు. (సశేషం)

## సవరణ

శ్రీ రమణజ్యోతి - అక్టోబర్, 2017 సంచిక, పేజీ-9లో క్రింద నుండి 4వ లైనులో చివరి పదాన్ని 'వైరాగ్యం' బదులు 'వివేకం' గా చదువుకొన ప్రార్థన.

**కరుణతో నన్నేలగా నాకు నీదు దరిశనము**
**నొసగి దయచూడవేని తమమున బాధిలు**
**ధరణినేమారి శ్రమనొంది విడువ దేహ**
**మెది నా గతియు**

*(అరుణాచలపదికం)*

# శ్రీ భగవాన్ పాద సన్నిధిలో (At the feet of Bhagavan)

ఆంగ్లమూలం: టి.కె. సుందరేశ అయ్యర్
(గత సంచిక తరువాయి) తెలుగు అనువాదం: జి. శ్రీహరిరావు

అరుణాచల అష్టకంలోని 6,7 పద్యాలను పరిశీలిస్తే:

"అంతా నీవే! హృదయానివి. అనంతమయిన జ్ఞానానికి, కాంతికి మూలానివి నీవే. నీవూ, నీ అద్భుత శక్తీ అభేదములు. ప్రారబ్ధమనబడే ఛాయాచిత్రంలో అణుమాత్రంగా నిబిడీకృతమయిన అనేక దృశ్యాలు, పంచేంద్రియముల ద్వారా మనస్సనే తెర మీద ఆ శక్తి వలననే రూపు సంతరించుకొనుచున్నవి. ఈ మిథ్యా దృశ్యాలు కనిపించిననూ, కన్పించకపోయిననూ, అవియన్నియూ నీవుదప్ప వేరొకటి కావు.

అహంకారము అణిగిన వెంటనే ఆలోచలన్నియు అదృశ్యమగును. అప్పటివరకు, ఏ ఆలోచనలు ఉత్పన్నమైనను, ఈ ఆలోచనలెవరికి వచ్చుచున్నవి? అని నిన్ను నీవు ప్రశ్నించుకొనుము. 'నాకు' అని సమాధానం వచ్చును. 'నేను' అన్న భావన యెక్కడి నుండి ఉత్పన్నమగుచున్నదో తరచి చూచుకొనుటకు అంతర్ముఖులము కావలెను. ఆ ప్రయత్నములో హృదయస్థానమును చేరుకొనిన యెడల జీవాత్మ పరమాత్మలో లీనమై, ద్వంద్వములన్నియు మాయమగును. 'నేను', 'నీవు'; పుట్టుక, చావు; 'పుణ్యము, పాపము'; 'సంతోషము, విచారము; 'వెలుగు, చీకటి' అన్నియు సమసిపోవును. ఆ సభాప్రాంగణములో, హృదయస్థానము నిశ్చలమయిన 'తాండవము' చేస్తుంది. అదే కరుణకూ, కాంతికీ నెలవైన కృపాసముద్రము అరుణాచలము.

స్తుతి పంచకములోని ఆఖరిదగు 'అరుణాచల పంచరత్నములు' అను శ్లోకమాలికను శ్రీ భగవాన్ మొదట సంస్కృతములో రచించి, తరువాత తామే తమిళానువాదము చేసిరి. 'కరుణా పూర్ణ సుధాబ్ధి'తో మొదలగు శ్లోకాన్ని శ్రీ భగవాన్ అప్రయత్నముగా వ్రాసిరి. చాలాకాలం తరువాత ఆ శ్లోకమును యెవరో శ్రీ కావ్యకంఠ గణపతి మునికి చూపించిరి. కావ్యకంఠులు, అదే ఆర్యావృత్తంలో యింకనూ నాలుగు శ్లోకములు వ్రాయమని ప్రార్థించారు. మొదటి శ్లోకము ఆశీర్వచన రూపముగనూ, రెండవది పరమాత్మ స్వరూప వర్ణనగానూ, మూడు, నాలుగు, ఐదవ శ్లోకములు జ్ఞాన, యోగ, భక్తి మార్గ వివరణలుగానూ రచింపబడినవి.

ఈ ఐదు రత్నముల హారమును ఒక సంపూర్ణ గ్రంథముగా భావించ వచ్చు. భక్తి పారవశ్యముతో వీటిని పాడుకొను సాధకులకు యీ పంచ రత్నములెంతో ఊరట కలిగించును. శ్రీ కావ్యకంఠులు యీ పంచ రత్నములపై శ్రీ సురేశాచార్య విరచిత 'మానసోల్లాసము' వంటి సుదీర్ఘ మయిన భాష్యము వ్రాయ సంకల్పించారు. కాని వారి సంకల్పం నెరవేరకుండానే విధి వారిని మన నుండి తీసుకువెళ్ళి పోయింది. శ్రీ కపాలి శాస్త్రిగారు సంస్కృతములో 'అరుణాచల పంచరత్న దర్పణము' అన్న శీర్షికతో ఒక చక్కటి భాష్యమును వ్రాసి పొందుపరిచిరి. రమణాశ్రమము వారిచే యీ గ్రంథము ప్రచురించబడినది.

రెండవ, ఐదవ శ్లోకముల యొక్క భావము క్రింద తెలుపబడినది:

"ఓ అరుణాచలా! ఈ చిత్రరచనలన్నీ నీవల్లనే ఉద్భవించును. నీ మూలాంగానే జీవించును. నీలోనే సమసిపోవును. సర్వజ్ఞులు నిన్ను పరమాత్మ అని, హృదయస్థానమని వివరిస్తారు. నీవు సదా 'నేను'గా హృదయంలో నర్తించుచూ వుందువు.

“హృదయంలో నిన్ను సదా దర్శించుచూ, సంపూర్ణ శరణాగతి పొంది, విశ్వమంతటిలో నిన్నే కాంచుచూ, ఏకాగ్రచిత్తముతో నిన్నే ధ్యానించువారు ధన్యులు. వారు నీతో ఏకమై పోవుదురు”.

సత్య స్వరూపాన్ని శ్రీ భగవాన్ యెంత స్పష్టంగా వివరించిరో గమనించుడు. ఈ రచనలు చదివి లాభము పొందు భక్తులు నిజముగా ధన్యులు.

**స్వర్గలోకమెక్కడ?**

నా చిన్నతనములో ఉపనిషత్తులు అధ్యయనం చేయునప్పుడు, దివ్యలోకములన్నీ సూర్యభగవానుడిలో నిక్షిప్తమై వున్నవని భావించి, శాస్త్రములలో సూచించబడిన పద్ధతులలో సాధన చేసెడివాడిని. తదుపరి, శ్రీ భగవాన్ ఆశ్రమములో స్థిరపడినప్పుడు కూడా, యిదే ఉపాసనను కొనసాగించితిని. కాని యీ మార్గము బహు దుర్గమమని పించినది. చాలా యిబ్బందులు యెదుర్కొన్నాను. విషయము అంతా శ్రీ భగవాన్‌కు నివేదించగా “అయితే స్వర్గలోకానికి వెళ్ళాలనుకుంటున్నా వన్నమాట” అని అన్నారు శ్రీ భగవాన్. “అది సాధించాలన్నదే నా ప్రయత్నము. శాస్త్రములలో నిర్దేశింపబడినది కూడ అదే కదా” అని జవాబిచ్చాను. “మరి యిప్పుడెక్కడున్నావు?” - శ్రీ భగవాన్ ప్రశ్న.

“నా సమాధానం: “ఇప్పుడు తమ సన్నిధిలో వున్నాను.”

“పిచ్చివాడా! నీవు యీ క్షణంలోనే స్వర్గములో వున్నావు. దాని కోసము యింకెక్కడో వెతుకుచున్నావు. ఆ దివ్యత్వంలో స్థిరంగా నిలిచిపోవటమే దివ్యలోకంలో నివసించుట. అదే పూర్ణత్వము. అట్టి వాడు చరాచర ప్రపంచాన్నంతటినీ ఆక్రమిస్తాడు, అధిగమిస్తాడు కూడా! ఒక సినిమా మొత్తం తెర మీద కన్పించినట్లుగా, విశ్వము మొత్తము దర్పణమానంగా అతనిలో కనిపించును.

సినిమా దృశ్యాలు కనిపించినా, కనిపించకపోయినా, తెర మాత్రము నిశ్చలముగా అక్కడే వుండును. కనబడే దృశ్యాల ప్రభావము తెరపై వుండనే వుండదు. నీవు యిప్పుడే, యీ క్షణంలోనే, ఆ దివ్యధామములో వున్నావు. నీ పరిస్థితి గంగానదిలో నిలుచుని దాహముతో బాధపడువాని చందముగా నున్నది. ప్రయత్నములన్నీ మానుకొని శరణాగతి చెందుము. స్వర్గలోకము కావాలెనని కోరుకొనే ఆ 'నేను'ను చావనివ్వు. నీకు వెంటనే స్వర్గలోకము ప్రాప్తించును. 'ఆత్మ'గా అది నీలోనే వున్నది. ఈ ఆత్మ నామరహితము, స్వరూప రహితము. భగవంతునికి భిన్నము కానిది ఆత్మ. నీ స్వాధీనములోనే వున్నదానిని నీవు బయటినుండి యెక్కడ తేగలవు? నీకు, ఆత్మకూ, తేడా లేదు అంటూ శ్రీ భగవాన్ ప్రసంగించిరి.

"పరమాత్మ శ్రీ భగవాన్‌లో పరివేష్టితమయి వున్నదని, దానిగురించి వేరుగా ప్రయత్నించనక్కర లేదనీ శ్రీ భగవాన్ భావము. జీవాత్మ, పరమాత్మ వేరనే మిథ్యనధిగమించితే చాలని శ్రీవారి బోధన" అంటూ శ్రీవారికి సాష్టాంగ ప్రణామమొనిర్చితిని.

"అంతే! అంతే!" అని సమాధానమిచ్చిరి. శ్రీ భగవాన్, "అహంకార మును నిర్మూలించుకొనుటయే మన కర్తవ్యము. అది జరగగనే, యిక్కడే, యిప్పుడే ఆత్మ సాక్షాత్కారమై నిరంతరము ప్రకాశిస్తుంది. స్వర్గానికి వెళ్ళుటము, రావటము అనేది వుండదు. నీ స్వస్థితిలో నీవు వుందువు అదే సాధన, అదే సిద్ధి.

సాక్షాత్తు తామే స్వర్గధామ సమానులైన శ్రీ భగవాన్ అనుగ్రహించిన యీ బోధన, వారి భక్తులందరికి ఉపయోగపడునన్న ఉద్దేశముతో యిచ్చుట పొందుపరచబడినది. *(సశేషం)*

# భగవాన్ రమణుల దైవిక లీలలు

- విడపనకంటి

## 4. ఆండవన్

తిరువణ్ణామలైలోని వేదపాఠశాలలో ఒక బ్రాహ్మణబాలుడు వుండేవాడు. చాలా పేద కుటుంబానికి చెందినవాడు. అతని తండ్రి ఆ బాలునిని వేదపాఠశాలలో చేర్పించిన ముఖ్యకారణం అక్కడ రోజూ మూడుపూటల విద్యార్థికి భోజనం పెట్టేవారన్నదే.

ఒకరోజు ఆ పాఠశాల పిల్లలనందరిని గిరిమీద (బ్రాహ్మణస్వామి) రమణుల దర్శనానికి తీసుకువెళ్ళారు. భగవాన్ కళ్ళు ఈ బాలుని చాలా ఆకర్షించాయి. అతని హృదయం మాతృభావనతో నిండిపోయింది. ''ఈ స్వామి బాగోగులు చూసుకునేవారెవరు వున్నారు?'' అని చింతించసాగాడు. దానితో అవకాశం వున్నప్పుడల్ల, స్వామి క్షేమ సమాచారాల విచారణకు కొండమీదికి వెళ్ళేవాడు. అక్కడ స్వామి కోసం చిన్నచిన్న పనులు చేస్తూ, ఆయన ఏమైన తినడానికి పెడితే ఆ కొంచెం తినేవాడు. భగవాన్ సమక్షం నుండి తొలగి వెళ్ళేవాడు కాదు. అతను తరచు పాఠశాలకు సరిగా హాజరు కానందువల్ల, ఉపాధ్యాయులు ''నీకు ఇక్కడ వుండి వేదాభ్యాసం చేయడం ఇష్టం లేకపోతే, ఇక్కడ భోజనం పెట్టడం కుదరదు'' అని చెప్పేశారు.

పాఠశాలకు వెళ్ళక్కర్లేదని భగవాన్ దగ్గరే వుండిపోవచ్చునన్నది ఆ బాలునికి ఎంతో సంతోషం కలిగించింది. ఊళ్ళోనికి వెళ్ళి భిక్షమడిగి ఆహారాన్ని తెచ్చేవాడు. ఎంత దొరికితే అంత స్వీకరించి కొండపైకి చేరేవాడు. భగవాన్ అందులో నుండి కొద్దిగా తీసుకుని ''ఇక నీవు తిను'' అనేవారు. అప్పుడే అతను తినేవాడు. ఒక రోజు ఊళ్ళో నుండి భిక్షను

తీసుకుని కొండను ఎక్కుతున్నప్పుడు, త్రోవ మధ్యలో ఒక రాతి మీద తన తండ్రి కూర్చొని వుండడం చూశాడు. ఆయన కొడుకును ఆపి "ఆ పాత్రలో తిండి వుందా? అయితే నాకు చాలా ఆకలిగా వుంది. కొంత నాకు ఇవ్వు" అని అడిగాడు. అందుకు తండ్రితో "నేను భగవాన్‌కు భోజనం తీసుకెళ్తున్నాను. మీరు నాతో కొండ మీదికి భగవాన్ వున్న చోటికి వస్తే మీకు కూడ కొంత ఆహారం దొరుకుతుంది" అన్నాడు. కాని తండ్రి కొండ ఎక్కగలిగే పరిస్థితిలో లేరు. అందుకే బాలుడు తండ్రిని అక్కడే వదిలి, పైకి ఎక్కాడు. విరూపాక్ష గుహ చేరిన వెంటనే భగవాన్‌కు భోజనం పెట్టాడు. కాని భగవాన్ "మొదట మీ తండ్రికి ఆహారం ఇమ్మన్నారు. "మీరు మొదట కొంచెం తినండి, నేను తరువాత వెళ్ళి మా నాన్నకు భోజనం ఇస్తాను" అన్నాడు కాని భగవాన్ ఒప్పు కోలేదు. ఇష్టం లేకున్నప్పటికి బాలుడు వెళ్ళాడు. కొన్ని నిముషాలలో తిరిగి వచ్చి "పిలిస్తే కూడ నాన్న రావడం లేదు. అందుకే మీరు తినండి. నేను ఆయనకు తీసుకెళతాను. భగవాన్, మీరు నా ప్రభువులు, మీకు మొదట ఆహారాన్ని ఇచ్చే అలవాటు నేను చేసుకొన్నాను ఎలా మారను? అన్నాడు. భగవాన్, "అలాగా! నిజం ఏమిటంటే అందరూ భగవానే! నీ తండ్రి కూడ భగవానే. ఆయనకు భోజనం తీసుకుని వెళ్ళు" అన్నారు.

ఆ క్షణంలో ఆ బాలునికి అందరూ భగవాన్ యొక్క ప్రత్యక్ష రూపాలే, ఇతరులు తనకు భేదం కారని అర్థమైంది. తన తండ్రికి భోజనం తీసుకుని వెళ్ళాడు. ఆ క్షణం నుండి అందరినీ 'ఆండవనే' (నా ప్రభూ) అని సంబోధించేవాడు, ఎందుకంటే అందరినీ భగవాన్ రూపంగా భావించాడు. అందరూ అతడిని ఆండవన్ అని పిలిచేవారు. అతడిపేరు రామనాథన్. భగవాన్ భక్తులకు అతను 'రామనాథ

బ్రహ్మచారి' అయ్యాడు. భగవాన్, భగవాన్ భక్తుల సేవలో అతను మునిగిపోయాడు.

ఆ రోజుల్లో తిరువణ్ణామలైకి రైలు రాత్రి 8.30 గం॥లకు వచ్చేది. ఆ రైలులో వచ్చిన భక్తుల అవసరాలను రామనాథన్ తీర్చేవాడు. వాళ్ళకు వేడినీరు, భోజనం ఇతర సదుపాయాలను కల్పించేవాడు. ఆ తరువాతి కాలంలో పాలకొత్తులో ఉంటున్న సాధువులకు తల్లివలె సేవలనందిస్తూ వచ్చాడు. అలాగ 'ఆండవన్'గా పిలువబడ్డాడు.

## 5. సర్వం త్యజించి ఆశ్రమంలో చేరిన మురుగనార్

తల్లి మరణానంతరం, మురుగనార్ ఆమె అంత్యక్రియలను శ్రద్ధతో ముగించారు. ధనుష్కోటికి వెళ్ళి సముద్రంలో ఆమె చితాభస్మాన్ని కలిపారు. ఆ తరువాత కొంత భస్మం వున్న మట్టిపాత్రతో తిరువణ్ణామలై వచ్చారు. ఆశ్రమం ప్రవేశద్వారం వద్ద వున్న ఇలుప్పై చెట్టు దగ్గర వుంచి భగవాన్ దర్శనానికి హాలులోనికి వచ్చారు. భగవాన్‌కు ప్రణమిల్లిన వెంటనే, "కార్యక్రమాలన్నింటిని పూర్తిచేశావా?" అని భగవాన్ అడిగారు. "చేశాను భగవాన్, అన్నీ నిర్వర్తించాను" అని మురుగనార్ జవాబిచ్చారు.

మురుగనార్ తన తల్లి చితాభస్మాన్ని ఒక పాత్రలో తీసుకొచ్చారని ఎవరో భగవాన్‌తో అన్నారు. ఆ భస్మాన్ని అగ్ని తీర్థంలో నిమజ్జనం చేయమని మురుగనార్‌ను ఆదేశించారు. అలా చేసిన తరువాత మురుగనార్ తన స్వస్థలమైన రామనాథపురానికి వెళ్ళారు. అక్కడి నుండి తమ స్నేహితుడు మేలై సుబ్రమణియ చెట్టియార్‌ను కలిసి, ఆయనను తమ కుటుంబ పరంపరాగత ఆస్తి (ఇంటికి) తీసుకువెళ్ళారు. "ఈ ఆస్తిని నీ పేరిట వ్రాస్తాను. దానిని అతి ఎక్కువగా లభించే సొమ్ముకు విక్రయించి నీ వద్దనే ఉంచుకో. నెల, నెల, కొంత సొమ్మును నా భార్య మీనాక్షి మనుగడకు మాత్రం ఇస్తూ వుండు" అని కోరారు.

నీ ఆస్తిని నా పేరిట మార్చాల్సిన అవసరం లేదు. మీనాక్షికి అవసరమయ్యే ఆ కొద్ది పైకాన్ని నేను ఆమెకు ఇస్తాను. దాని కోసం ప్రత్యేకమైన ఏర్పాట్లు ఏవీ చేయాల్సిన పనిలేదు, అని చెట్టియార్ బదులిచ్చాడు. కాని మురుగనార్ తమ పట్టువీడలేదు. ఒకవేళ డబ్బులు ఎక్కువగా వస్తే, అదనంగా వున్నదాన్ని శ్రీరమణాశ్రమానికి విరాళంగా ఇవ్వమని, మీనాక్షికి ప్రతినెల మాత్రం, జీవనభృతిని ఇమ్మని చెప్పారు.

ఆస్తి బదలాయింపు జరిగిన తరువాత మురుగనార్ చెన్నైకి వెళ్ళిపోయాడు. మొదట బయలుదేరేముందు తాము రామనాథపురం వెళ్తున్నట్లు మీనాక్షితో చెప్పివుండలేదు. తిరువణ్ణామలై వెళ్ళాడని భావించిన మీనాక్షి మురుగనార్ గురించి ఆందోళన చెంది భర్త కోసం వెదకడం మొదలుపెట్టింది. మురుగనార్ రామనాథపురం వెళ్ళాడన్న వార్త తెలుసుకుని అక్కడికి వెళ్ళింది. కాని అప్పటికే మురుగనార్ చెన్నై బయలుదేరి వెళ్ళిపోయారు. ఆమె చెన్నై చేరేసరికి, మురుగనార్ తాము పనిచేస్తున్న స్కూలు ఉద్యోగానికి రాజీనామా చేసి, తమ సామాన్లు సర్దుకుని తిరువణ్ణామలై వెళ్ళారు.

తిరువణ్ణామలై చేరిన మురుగనార్ కొన్ని వంటపాత్రలు ఆశ్రమ వంటశాల కోసం కొన్నారు. లౌకిక సంపదలను వదిలించుకుని, భార్య మనుగడకు ఏర్పాటు చేసి వచ్చిన మురుగనార్ తమ లౌకిక బాధ్యతలను నెరవేర్చామని భావించారు. భగవాన్ సన్నిధికి చేరిన మురుగనార్ ఆపై తమ గురువుకు పూర్తిగా శరణాగతి చెందారు.

## 6. ఆకుకూరల అవ్వ

అరుణగిరిపై వున్న గుహై నమశ్శివాయ మండపంలో ఒక వృద్ధురాలు నివసిస్తూ వుండేది. రమణులు అరుణాచలేశ్వర

దేవాలయంలో ఉంటున్న రోజుల్లో వారి దర్శనానికి ఆమె ప్రతి దినం వచ్చేది. ఆ తరువాతి కాలంలో ఆయన విరూపాక్ష గుహకు మారినప్పుడు ఆమె రోజూ రమణులకు కొంత ఆహారాన్ని తెస్తూ వుండేది.

ఆవిడ ఉంటున్న పాత మండపానికి విరగడానికి సిద్ధంగా వుండే ఒక తలుపు, పనిచేయని తాళమూ వుండేవి. ఆమె ఆస్తి మొత్తం వండడానికి ఒక కుండమాత్రమే. దానినే తన స్నానానికి వాడుకునేది. ఆ కుండనే అన్నము, కూరలు వండుకొనేందుకు ఉపయోగించేది. సూర్యోదయానికి పూర్వమే బయలుదేరి గిరి మీద పెరిగే ఆకుకూరలు, కూరగాయలను ఏరుకు వచ్చేది. ఊళ్ళోకి వెళ్ళి భిక్షమెత్తుకునేది. లభించిన బియ్యము, పప్పులను దాచి వుంచేది. ఉన్నవాటిని వండి రమణులకు ఆహారంగా తీసుకు వచ్చేది. "ఒక మహానుభావురాలు నిన్న కొన్ని నూకలను పెట్టింది. దాన్ని గంజి కాచి తీసుకొచ్చాను స్వామీ! రుచిచూడండి" అంటూ బ్రతిమిలాడేది.

ఆకుకూరలేవీ దొరకని రోజుల్లో ఆమె ఎంతో నిరాశపడేది. అలా ఆమె బాధపడుతున్నప్పుడు రమణులు మునగచెట్టు ఎక్కి కొన్ని లేత మునగాకులను కోసుకొచ్చేవారు. వాటితో వంటకం తయారుచేసి ఆయనకు పెట్టేది. ఏదో ఒకటి లభించిన ప్రతిరోజు ఆయా ఆకుకూరల ప్రాశస్త్యాన్ని గురించి చెబుతూ వాటి ఆరోగ్యప్రభావాన్ని గురించి "స్వామీ! ఇది జీర్ణక్రియకు మంచిది, ఇది కంటిచూపుకు మంచిది" అని వర్ణించేది. వండినదానిని ఎంతో ప్రేమతో తినిపించేది. తాను తీసుకొచ్చిన కూరలు తనకోసం కాదు తన ప్రియమైన స్వామికి ఆహారంగా పెట్టాలన్న ఆదుర్దా మాత్రమే ఆమెలో కనిపించేది. ఆమె ఏమి వండి పెట్టినప్పటికి రమణులు ఆనందంగా భుజించేవారు.

# విజయనగరం రమణస్వామి

(రమణస్థాన్, విజయనగరం, వారు ప్రచురించిన "రమణ పాదసన్నిధిలో" అన్న పుస్తకం నుండి గ్రహించబడినవి)

శ్రీపాలపాటి విశ్వనాథ సుబ్రహ్మణ్య శర్మగారు శ్రీ అరుణాచలేశ్వరుల, శ్రీ భగవాన్ రమణుల సంపూర్ణ అనుగ్రహానికి పాత్రులైనవారు. శ్రీరమణుల బోధనలను తమ జ్ఞానానుభావంతో జోడించి ప్రవచించుతారు. కాబట్టి వారి అనుయాయులు వారిని "రమణస్వామి" అని భక్తితో పిలుచుకుంటారు. శ్రీ వర్మగారు 18వ సం॥ వయసులో భగవాన్ చిత్రపటం చూసి భక్త్యావేశంలో మునిగి ఆ తరువాత అరుణాచలాన్ని సందర్శించారు. అక్కడ 18 నెలల వ్యవధిలో 5 పర్యాయములు ఎంతో కఠినమైన 14 కిలోమీటర్ల పరిధి గల అరుణాచలానికి సాష్టాంగ దండప్రణామ ప్రక్రియతో ప్రదక్షిణలు చేశారు. అందుకే తిరువణ్ణామలైలో రమణస్వామి "సాష్టాంగ స్వామి"గా సుపరిచుతులయ్యారు. వారి ప్రవచనములు రమణ (ఆత్మ) తత్వానికి ప్రతిబంబాలు.

రమణస్వామిగారి ముఖ్య అనుయాయులలో ఒకరైన శ్రీమతి దేవిగారు స్వామివారి రోజువారీ ప్రవచనాలను శ్రద్ధతో వ్రాతపూర్వకంగా నమోదు చేశారు. ఆ మహావాక్యాలలో ఎన్నుకోబడిన కొన్నింటిని మన పత్రిక పాఠకులకు పరిచయం చేస్తున్నాము.

* మనదికాని శరీరాన్ని మన స్వంత ఇల్లుగా భావించి పొరబాటు చేస్తాము. సద్గురు అనుగ్రహం పొందినప్పుడు గురువే దానిని పునాదులతో సహా మనతోనే తొలగింపజేస్తారు.

* ద్వంద్వము నుండి భక్తుడిని బయటకు లాగే శక్తి గురువుకు మాత్రమే ఉంది.

* మనసు అంతర్ముఖమై, ప్రాణ, బుద్ధులు, స్తబ్ధమై, 'నేను' అనే వ్యక్తిగత ఎరుక పరిధి దాటితేనే, అనుగ్రహం యొక్క పూర్ణత్వం అనుభవమవుతుంది.

* ఎట్టి విషమపరిస్థితినైన, మహదానందమైనదిగా ఉదాసీనంగా సమ్మతించడమేగాని వ్యతిరేకించడం గురువు సమ్మతించరు.

* నిరంతరం అంతా భగవంతుడి నిర్ణయమే నిజమైన దైవస్థితి, దైవస్తుతి, నిరంతర ప్రగతి, ఎనలేని తృప్తి.

* బ్రాహ్మీ స్థితి అనుభవైకవేద్యమే గాని వర్ణనాతీతం.

* సముద్రం ఒడ్డునుండి చూస్తే, అంతా సముద్రమూ, అలలూ, రెండూ కనిపిస్తాయి. సముద్రంలో ఉండి చూస్తే అంతా సముద్రమే. చూసేవాడు కూడ సముద్రంలో భాగమే.

* మన కళ్ళజోడు ఎలా మన కంటిని తెలుసుకొనలేదో, అలాగే మన కళ్ళు భగవంతుడిని తెలుసుకొనలేవు. ఎరుకే కన్నుకు కన్నై ఉన్నది.

* ఆధ్యాత్మికత మిథ్యగా మొదలై సత్యముగా నిలిచి జగముగా కనిపించి భగవంతుడనే సమ్మతితో ముగుస్తుంది.

* ఏదో ఒక కారణం వల్ల కలిగేది వస్తు భక్తి, వస్తు భక్తితో బంధం బలపడుతుంది. అకారణంగా కలిగేది 'పరాభక్తి'. పరాభక్తి వల్ల బంధం బ్రద్దలవుతుంది.

* మాటలను మౌనానికి బానిసను చేయండి. చూపులను అంతరము నకు గురిపెట్టండి.

* సంసారం బయటలేదు. నేను శరీరాన్ని అనే స్ఫురణ ఎక్కడ పుడుతుందో అక్కడే సంసారం ఉంటుంది.
* "ఉన్నది" (ఎరుక) తప్ప అన్నీ సంకల్పమే. ఇలా చెప్పడం కూడా సంకల్పమే. ఉన్నదానిని పోగొట్టుకొనడం కుదరదు. లేని దాన్ని పొందడం కుదరదు.
* తానైన దానికి తపమెందుకు? సహజమైన దానికి సాధన ఎందుకు?
* ధ్యానమనేది ఒక ప్రత్యేక ప్రక్రియ కాదు. దైవావేశం పొంగినప్పుడు ఉన్న నిరంతర నిశ్శబ్ద స్తబ్ధమది.
* జ్ఞానమంటే పరిపూర్ణంగా తనను తాను గ్రహించి తన వ్యక్తిగత అనుభవాన్ని వదిలివుండడం. సదా పూర్ణముగా అంటే పరిధి లేక ఉండడం.
* ఎరుకతో తెలుసుకొనడమే జ్ఞానమంటే. అది నిరంతరమై, సరళమై, సహజమై ఉన్నది. అదే నిత్య సత్య సత్సంగం.
* నీతో నీవుండు. నీవుగా నీవుండు. నీలో నీ వుండు. నీలోని నీ ఉనికే సర్వమునకు ఉనికి అని ఉండు.
* ఈ దేహమే నేను అన్నంతవరకు, దేహము ఉన్నంతవరకు, సందేహం పోదు.
* సత్యస్థితి అంటే పాతను విడిచి క్రొత్తను పొందడం కాదు. దేనినో పొందాలన్న తలపు అస్తమించడమే.
* పువ్వులో పరిమళం ఎంత సహజంగా ఉంటుందో చైతన్యంలో 'జగత్, జీవుడు, దేవుడు' అంతే సహజంగా ఇమిడివున్నారు.

(సశేషం)

# ప్రయత్నం అవసరమా?

('మౌంటెన్ పాత్' - అక్టోబర్-డిసెంబర్, 2008 (సంపుటి 45, సంచిక 4) లో "ఎఫర్ట్ అండ్ ఎఫర్ట్‌లెస్‌నెస్" అన్న శీర్షికతో ప్రచురితమైన సంపాదకీయం నుండి ఎన్నుకొనబడిన భాగాల అనువాదం)

- డా. వి. రామదాస్ మూర్తి

భారతదేశంలోనే గాకుండ ప్రపంచవ్యాప్తంగా అసాధారణమైన మానసిక, నైతిక స్థాయిని ప్రదర్శించిన ముఖ్య వ్యక్తులలో మహాత్మా గాంధి ఒకరు. ప్రత్యేకించి, ఆయన నవభారతాన్ని రూపుదిద్ది, ఇతర రాజకీయ శ్రేణులను శాంతియుతంగా స్వతంత్రాన్ని సాధించే దిశలో ఉత్తేజపరచిన నాయకుడిగా ప్రజాదృష్టిలో పేరుపొందారు. దేశాన్ని పరాయి పరిపాలనా శృంఖలాల నుండి విడుదల చేయించారు. అంతే గాకుండ దేశప్రజలకు ఆధ్యాత్మిక విలువల ప్రాముఖ్యాన్ని తెలియ జెప్పడంలో అలుపెరుగని కృషి చేశారు. తాను స్వయంగా ఆచరిస్తూ, లక్ష్య సాధనకు ఏ మార్గాన్నైనా ఎంచుకోవచ్చునన్న అభిప్రాయం తప్పు అని తెలియజెప్పారు కూడ. అలాగే అంతర పవిత్రీకరణ అవసరమని, బాహ్య స్వాతంత్ర్యంతో బాటు స్వశక్తిపై నమ్మకానికి కూడ సమానమైన ప్రాముఖ్యతను ఇవ్వాలని ఆచరించి చూపారు. తమ జీవిత కాలాన్ని మొత్తం గాంధీజీ నిర్విరామమైన కృషికి, తీవ్రమైన ప్రయత్నాలకు అంకితం చేశారు.

రమణ మహర్షి, గాంధీజీ సమకాలీనులు. ఇద్దరూ నిరాడంబరతకు చిహ్నాలే. ఖాకీ గుడ్డ, చేతికర్ర, చెప్పులు, నడుము దగ్గర దోపబడిన ఒక గడియారం, ఇవి గాంధీజీ నిరాడంబరతను సూచిస్తే, ఇక రమణ మహర్షి విషయంలో పేర్కొనవలసినవి ఒక కౌపీనం, కమండలం. భగవాన్ రమణలాగ మహాత్మాగాంధీ కూడ పనులు, తమ కర్తవ్యాల

విషయంలో చక్కని సమయపాలన చేసేవారు. వారి మధ్య ఎంతో గౌరవభావం వుండేది.

కాని వారిద్దరి దినచర్యలు, కార్యక్రమాలను గమనిస్తే మాత్రం భగవాన్, గాంధీజీల మధ్య పూర్తిగా తేడా కనిపించేది. దేశాన్ని ఐక్యంగా వుంచడంలోను, స్వాతంత్ర్య సాధన కోసం జనాన్ని సిద్ధపరచడంలోను, గాంధీజీ ఎడతెగని శారీరక, మానసిక ప్రయత్నాలను గొప్పస్థాయిలో చేసేవారు. వినతితో కూడిన ఆయన యొక్క శక్తివంతమైన వాదనలు జనాన్ని చాలా ప్రభావితం చేసేవి. ఆయన కోసం ధనాన్ని నగలను, ఆఖరుకు తమ స్వతంత్రాన్ని కూడ సమర్పించుకునేందుకు సిద్ధపడేలా చేసేవి. ఇటు భగవాన్ చూస్తే, బయటివారికి ఆయన ఏ పని చేయకుండ ఊరికే వున్నట్లు అగపడేవారు. సాధారణ వ్యక్తిలాగ శరీరాన్ని శుభ్రంగా వుంచుకొనడం, ఆరోగ్యాన్ని పాటించడం వంటివి మాత్రమే ఇతరులకు కనిపించేవి. ఆయన ఏ రాజకీయాల్లోను పాల్గొనలేదు. ఎలాంటి ఉద్యమం మొదలుపెట్టలేదు, నడపలేదు కూడ. తమను తాము ఒక గురువుగా ఎప్పుడూ భావించలేదు. కనీసం మాట కూడ ఎంతో అవసరం వస్తే తప్ప మాట్లాడేవారు కాదు. బాహాటంగా ఏ ప్రయత్నమూ లేకుండ ఆయన ఆయనగా వుండేవారు. (కాని మహర్షి ఆధ్యాత్మికతకు భారతదేశమేగాకుండ ప్రపంచం మొత్తం వారికి జోహారులు అర్పించింది).

రమణమహర్షి, మహాత్మాగాంధీ నిర్వహించిన పాత్రలను గమనిస్తే వారి మధ్య ఒక విరుద్ధరీతిలో వుండే తీవ్ర ప్రయత్నానికి, ప్రయత్న రాహిత్యానికి చక్కని ఉదాహరణగా తోస్తుంది. ఈ ఇద్దరు గొప్ప చారిత్రిక వ్యక్తులు పరస్పరంగా వ్యతిరేక ధృవాలన్నట్టు అనిపించినప్పటికి,

సత్యాన్వేషణకు ఇద్దరూ పూర్తిగా అంకితమయ్యారు. వారు సాధించిన ఫలితాలు ఎంతో ప్రామాణికమూ ఫలప్రదానమైనవిగా చెప్పుకోవచ్చు.

బాహ్యంగా కనపడే విధంగా భగవాన్ ఏమీ చేయకుండ సోఫాలో ఒక ముద్దలా కూర్చుండిపోయేవారని అనుకుంటే అది తప్పు. సాత్విక స్థితిలో వుండడమన్నది అతి శక్తివంతమైన స్థాయిలో మనిషి ప్రకటించగల భావం. ఒక గాయకుడు లేదా నర్తకుడు ఇచ్చిన అద్భుతమైన ప్రదర్శనను చూస్తే, మనం అందుకు పెద్దగా ప్రయత్నం చేయనక్కరలేదన్న భ్రమలో పడతాము. అది సులభం, మనమూ చేయగలమన్న భావన కలుగుతుంది. అలాగే కచేరీలో మనం కూడ పియానో వాయించగలమని, లేదా వింబుల్డన్‌లో టెన్నిస్ ఆడగలమని అనుకుంటాము. కాని నిజంగా అలా ప్రయత్నిస్తే వాటికి కావలసిన కౌశలం, నేర్పరితనం మనకు లేదని బోధపడుతుంది.

ఒక పర్వతాన్ని ఎక్కాలంటే మనం అడుగున మొదలుపెట్టి శ్రమ పడుతూ పైకి ఎక్కాలి. మనం శిఖరాన్ని చూడగలుగుతాము కాని దాన్ని అలా వూరికే చేరగలమని అనుకునేది ఒక కల మాత్రమే. మన ముందు ఎంతో కష్టతరమైన శ్రమ వుంటుందని, దాని నుండి ఎవ్వరూ తప్పించ లేరని తెలియవస్తుంది. ఒక్కొక్క రాయి నుండి మరొక దానిని చేరుకుని ఎంతో జాగ్రత్తగా కదలాలి. ముందుగానే విజయం సాధిస్తామన్న ధీమా పనికిరాదు. అలాగే మన లోపాలను గురించి ఆలోచనలను ముందే పెంచుకుని నిరుత్సాహం చెందడం కూడ ప్రగతికి ఉపయోగపడదు. నిజానికి, ఒక ప్రయాణం విషయంలో మనం గమ్యం చేరగలిగామన్న దానికంటే, త్రోవలో మనం ఏమి తెలుసుకోగలిగామన్న ఎఱుక ముఖ్యమైనదిగా భావించాలి.

మానవుడు జీవితంలో గమ్మత్తైన అనుభవాలను చవిచూస్తాడు. ఒక్కొక్కసారి ఫలానాచోటునుండి అన్నది తెలియకుండ ఏమీ చెల్లించకుండ, ప్రయత్నం చేయకుండ, కృప కురుస్తుంది. అలా అనుకోకుండ జరిగినదానికి ఎంతో ఆనందం, హుషారు కలుగుతాయి. కాని అరుదుగా మాత్రమే అలాంటి అనుభవం రెండవసారి, మూడవసారి ఎదురు కావచ్చునేమోగాని మరెప్పుడు అలా జరగకపోవచ్చు కూడ. దేవుడు, అద్భుతశక్తి లేదా గురువు అని ఏ పేరుతో పిలిచినప్పటికి, అది మనకు పూర్తిగా ఉచితంగా లభించినదే. ఆ రుచి మరిగినందు వల్ల మళ్ళీ అలాంటి అనుభవం ఎందుకు జరగడంలేదు, జీవితం ఎందువల్ల మళ్ళీ ప్రకాశవంతం కావడం లేదు అన్నదానినే పునశ్చరణ చేసుకుంటాం. ఆ సందర్భాన్నే తలచుకుంటూ ఇతర వనరులు, పుస్తకాలు లేదా విజ్ఞులనుకున్న వారి ద్వారా జవాబు రాబట్టుకునేందుకు ప్రయత్నిస్తాం.

రమణతత్త్వాన్ని గురించి పత్రికలలో కనిపించే వ్యాసాలు తరచు రెండు విరుద్ధమనిపించే అభిప్రాయాలను వ్యక్తం చేస్తాయి. కొందరు సాధనలో మన ప్రయత్నం అవసరమని భగవాన్ చెప్పారని పేర్కొంటారు. మరికొందరు మహర్షి సాధకుడు చేయవలసినది ఏమీ లేదు, తాను తానుగా వుండడం మాత్రమేనని అన్నారంటారు. వీటి మతలబు ఏమిటి? నిజానికి రెండూ సరియైన ధోరణులే. మనం మన మనసును, హృదయాన్ని పవిత్రపరిచే ప్రయత్నం చేస్తే తప్ప గురుకృపకు పాత్రులయ్యే స్థితికి చేరుకోలేము. అలాగే మనం తటస్థంగా నిశ్చల స్థితిలో వుండి శరణాగతి చేసుకుంటే చాలు, గురువు అనుగ్రహానికి పాత్రులవుతామన్నది ఈ అభిప్రాయం.

కాంగ్రెస్ కార్యకర్తలు ఆశ్రమాన్ని సందర్శించిన సందర్భాలలో వాళ్ళు దేశ స్వాతంత్ర్య సాధనకు ఏమి చేయాలి, ఎటువంటి ప్రణాళికలు సిద్ధపరచుకొనాలి అని అడిగేవారు. భగవాన్ వారి దృష్టిని నిష్కామకర్మ వైపుకు మరల్చి, ఫలితాలను గురించిన "ఏ ఆలోచన లేకుండ ఒక అతీత శక్తికి శరణాగతి చెందడం మంచిది" అన్న సలహా ఇచ్చేవారట. అప్పుడు గెలుపు, ఓటముల ప్రసక్తి వుండదు, ఏది జరగాలని వుంటే అది జరుగుతుంది అనేవారు. ఇక్కడ శరణాగతి అంటే భగవాన్ ఉద్దేశం ఏ కోరిక, భయమూ లేకుండ ఆ క్షణంలో ఏది సంభవిస్తే దానిని స్వీకరించగల ఎఱుక కలిగి వుండడమే. అంటే, అదేదో సోమరి తనంతో వెల్లకిలా అలా వుండిపోవడం కాదు, ఆ స్థితికి చేరడానికి బ్రహ్మాండమైన శ్రద్ధ, అంకితభావం అవసరం. శరణాగతి అన్నది ఎంతో స్థైర్యంతో కూడిన వ్యవహారం. దుర్బలులకు అది దుర్లభం.

మనం గురువు వైపుకు ఒక అడుగు వేస్తే గురువు మన వైపుకు పది అడుగులు వేస్తారని భగవాన్ చెప్పేవారు. ఇందులో గమనించ దగినది మనం ఆ ఒక్క అడుగు వేయడమన్నది. అది మన బాధ్యత. ఆ దిశలో ప్రయత్నం జరిపితే తప్ప ఆ ఉన్నత శక్తి మనల్ని అజ్ఞానం నుండి బయటపడెయ్యదు, పడెయ్యలేదు కూడ. మన సోమరితనమే మన ఓటమికి కారణమవుతుంది. మన అంతరాళాల్లోని లోపలి అంచులను చేరడానికి ప్రయత్నం అవసరమన్న విషయం మన బాధలు తట్టి లేపేవరకు మనం గుర్తించం.

* * *

# The unfathomable Sri Bhagavan (Part 2)

by GudipatiVenkataChalam

(Translated from Telugu by G.Srihari Rao)

The demeanour of Bhagavan used to change from time to time. When he used to gaze at the blissful and effulgent vacant spaces beyond the horizon, he appeared as the very manifestation of Dakshinamurthy in meditative posture. The profile of Bhagavan appeared so artistic! We could not remove our gaze from that magnificent form. It was like enjoying the eternal and immovable Sun. For people like me, familiar only with the ordinary beauties of life, his face or body held out no special attraction. But his imposing and dignified posture radiated a grace and splendor that was out of the world. Something ethereal and unreachable appeared illuminating his form. We used to be awestruck, looking at him sitting like the King of Kings, clad but in a cod piece. Even in that state, if someone were to call out to him as Bhagavan, he used to come down to the normal plane. But where is the question of his coming down- the omnipresent and omniscient being that he is?

One was scared of addressing him. People in power, high placed officials, the proud and arrogant ones and the army officers – all used to shiver in his presence – before that frail, aged and unaided personality bereft of any worldly authority.

Bhagavan used to go up the Hill three to four times a day from his abode in the ashram. He used to walk in front, one step at a time, escorted by his attendant with his water pot. Now and then he used to talk to a devotee, gazing at the Hill here and there. People like me watched him from the foot of the Hill without blinking, till he went out of our sight. One used to get the feeling every time that he will go up the Hill step by step and may choose to disappear into the sky without returning back.

When Bhagavan made an attempt to get up from his sofa in his terminal days, with the body rendered extremely weak after repeated operations, the onlookers physically felt his pain in their own beings. He probably did not shrug off that pain only to make it palpable for the people around. The pinnacle of state he attained and the indescribable happiness he radiated are as much meant for his devotees as the bodily suffering he was subjected to. He suffered from rheumatic pain in the knees. They used to massage and knead his legs with the medicated oils sent by some one or the other. While getting up from the sofa, Bhagavan used to massage his own legs. When someone offered to do it for him, he warded them off by saying, "Leave it! You cannot take away all the *punya*. Let me also earn some!" When he stood up and took one step after another with the help of a walking stick, the devotees missed a heartbeat with every step of his. Crossing the stone threshold of the new hall constructed by the ashram authorities was an ordeal for Bhagavan. The onlookers and even the children longed to help Bhagavan by holding him. But Bhagavan used to brush aside the attendants who went to offer their shoulders as support to him. On occasions he fell down but he refused help.

God manifests on the earth in some form to accept disciples, train them and make them pure. The style adopted by each Guru will be unique. But what is important is the total faith and implicit obedience in carrying out Guru's instructions. The teachings of the Gurus may appear to be odd and in contradiction to the religions, traditions, practices and deeply ingrained morals of the people into whose midst they got manifested. Many followers will desert their Gurus when they cannot act in violation of the

principles they believe in. Some may follow a via-media course when they neither leave their Guru nor follow his instructions.

